‘ఉపాధి’కి దూరం ‘తెట్టంగి’

- ఉగాది తరువాత ప్రారంభించని పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పనుల్లేక అవస్థలు పడుతున్న గ్రామస్తులు


పనుల్లేవని చెబుతున్న గ్రామ మహిళలు

గుర్ల: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న వారిందరికి వంద రోజులు పని దినాలు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికి వీలుగా ఉపాధి హామీ అధికారులు వేతనదారులకు పనులు కల్పించాల్సిన బాధ్యత ఉంది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మండల ఉపాధి హామీ అధికారులు మండలంలోని తెట్టంగిలో కొత్త ఆర్థిక సంవత్సరంలో వేతనదారులకు నేటి వరకు ఎటువంటి ఉపాధి పనులు కల్పించలేదు. దీంతో వేతనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెట్టంగిలో 14 శ్రామిక సంఘాలు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 14 గ్రూపులలో ఉన్న సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వంద రోజులు పని దినాలు కల్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత గ్రామంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లును తొలగించాలని అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు తొలగింపుపై గ్రామంలో యుద్ధ వాతావారణం తలెత్తడంతో ఉపాధి హామీ అధికారులు తెట్టంగిలో ఉపాధి హామీ పనులను పూర్తిగా నిలిపివేశారు.

పనుల్లేక ఖాళీగా ఉన్న 873 మంది

తెట్టంగిలో 529 జాబ్ కార్డులు ఉన్నాయి. 873 మంది వేతనదారులు ఉపాధి హామీ పనులకు వెళ్తు ఉండేవారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి నేటి వరకు ఉపాధి హామీ పనులు ప్రారంభించక పోవడంతో వీరందరు ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల బయట ప్రదేశాలకు పనులకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న సమస్యను పరిష్కరించి ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని వేతనదారులు కోరుతున్నారు.

చేతులెత్తిసిన ఉపాధి హామీ అధికారులు

తెట్టంగిలో ఉపాధి హామీ పనులు చేపట్టడానికి అధికారులు చొరవ చూపడం లేదు. ప్రస్తుతం పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై స్థానిక టీడీపీ నేతలు అవినీతి ఆరోపణ చేసి ఆయనను విధులకు హాజరు కాకుండా చేశారు. ఉన్న మేట్లు అందరు ప్రతిపక్ష పార్టీకి చెందిన సానుభూతిపరులుగా ఉండడం వల్ల ఉపాధి హామీ పనులు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించలేక అధికారులు తెట్టంగి యుక్తధార పైలెట్ ప్రాజెక్ట్‌కు ఎంపిక అయ్యిందని అందుచేత ఉపాధి హామీ పనులు ప్రారంభించడానికి వీలు పడడం లేదని చెబుతున్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి



తెట్టంగిలో ఉపాధి హామీ పనులు ప్రారంభించి గ్రామస్తులకు పని కల్పించాలి. పనులు లేకపోవడంతో ఖాళీగా ఉండాల్సి వస్తుంది. దీంతో కుటుంబ జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయి.

– జమ్ము చిన్నం నాయుడు, వేతనదారుడు , తెట్టంగి

ఫిర్యాదు చేసినా..



తెట్టంగిలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు సమస్యలు ఉంటే వారిని పక్కనపెట్టి టెక్నికల్ అసిస్టెంట్‌తో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి.

– పెనుమజ్జి పైడినాయుడు , తెట్టంగి

చొరవ చూపడం లేదు



తెట్టంగిలో ఉపాధి హామీ పనులు ప్రారంభించడానికి అధికారులు చొరవ చూపడం లేదు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టి ఉపాధి హామీ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఏడు వారాలుగా ఉపాధి హామీ పని కల్పించలేదు.

– వెన్నె అప్పలనాయుడు , తెట్టంగి

యుక్తధార ఎంపికతోనే..



తెట్టంగి పంచాయతీ యుక్తధార ప్రాజెక్ట్‌కు ఎంపికైంది. అందుకే ఉపాధి హామీ పనులు కల్పించలేక పోతున్నాం. ఉపాధి హామీ పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. పనులు చేపట్టకపోవడం వలన ఫీల్డ్ అసిస్టెంట్‌కు కూడా మెమో జారీ చేశాం.

ఎస్. రత్నమాల, ఏపీవో, ఉపాధి హామీ పథకం, గుర్ల

ఏపీలో మహిళలు, చిన్నారులకు రక్షణ లేదు..

- జెడ్పీటీసీ శిరీష


జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత శాంతిభద్రతలు క్షీణించాయని, ఒకప్పటి బిహార్ కంటే అధ్వానంగా తయారయ్యాయని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోయాయయని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న హత్యలు, అత్యాచారాలు చూసి పట్టపగలు సైతం బయటకు వచ్చేందుకు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆడ పిల్లలను కళాశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర హోం మంత్రిగా ఓ మహిళ ఉన్నప్పటికీ మహిళలకు రక్షణ లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఏడాది కాలంలో మహిళలపై ఇష్టారాజ్యంగా దాడులు జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కనీసం పోలీస్ శాఖతో సమీక్ష కూడా జరపని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళలు రక్షణ కోసం దిశ యాప్‌తో పాటు దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రాజ్యాంగాన్ని సమర్థవంతంగా అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు జరుగుతోందని తెలిపారు. పోలీస్ వ్యవస్థ కూడా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసే పనిలో బిజీగా వున్నారని తెలిపారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా లక్ష్యం

- ఇంచార్జ్ ఆర్డీవో ఆశియ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జ్ ఆర్డీవో ఆశియ్య

చీపురుపల్లి: ఓటర్లకు కచ్చితమైన జాబితా అందించడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ పని చేస్తోందని ఇంచార్జ్ ఆర్డీవో బి.ఆశియ్య అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పులు, తడకలు లేని ఓటర్ల జాబితా రూపొందించడంలో అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రధానంగా ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు చాలా కీలకమన్నారు. అర్హత లేని ఓటర్లను తొలగించడంతో పాటు అర్హత కలిగిన ప్రతీ ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేర్పించడం అందరి బాధ్యత అన్నారు. ఎన్నికల సమయానికి పకడ్బందీగా ఓటర్ల జాబితాలు ఉండాలనే ధ్యేయంగా ఎన్నికల కమిషన్ అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇలాంటి సమావేశాలను రాజకీయ పార్టీ ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తహీసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

13న యోగా డే

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో ఈ నెల 13న జరిగే యోగా దినోత్సవం విజయవంతం చేయాలని ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ కోరారు. తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు బాధ్యతతో కృషి చేసి ఆరు వేల మంది యోగాలో పాల్గొనే విధంగా సహకరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది ఐకేపీ, ఉపాధి తదితర శాఖల సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో హైకేపీ ఏపీఎం సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ రవికుమార్, ఎంఈవో నాగభూషణం పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వతో ప్రజల అవస్థలు


గురండి సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు

భామిని: మండలంలోని గురండి కూడలిలో ఏబీ రోడ్డుపై వర్షం పడితే చాలు నీరు నిల్వ ఉండి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కురిసిన వర్షానికి ఏబీ రోడ్డులో నీరు చేరి అవస్థలు పడ్డారు. నెల రోజుల కిందట గురండి కూడలి వద్ద రోడ్డు మరమ్మతుల పేరిట జేసీబీతో ఉన్న తారు రోడ్డును తవ్వేశారు. స్టోన్ మిక్చర్ వేసి చేతులు దులిపేసుకున్నారు. తరువాత పనులు ఆపేశారు. దీంతో నీరు నిల్వ ఉండి స్థానికులతో అవస్థలు తప్పడం లేదు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


వివిద రంగుల బెల్టులు సాధించిన విద్యార్థులతో నూకరాజు

కొత్తవలస : విశాఖపట్నం జిల్లా వేపగుంట సమీపంలో గంటల కనకారావు కరాటే అకాడమీలో మంగళవారం జరిగిన కరాటే బెల్టు పోటీల్లో కొత్తవలస మండలానికి చెందిన ఒకేనావా స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు చైర్మన్ కె.సూర్యనూకరాజు తెలిపారు. ఈ బెల్టు టెస్టు పోటీల్లో కె.గౌతమ్‌రితిక్, పి.జెస్సికా, ఎ.సాయిసుజన్, ఎల్.అవినాష్‌లకు బ్లాక్ బెల్టు, పి.నాగవెంకట వంశీ, పి.గౌరీప్రసన్నలకు గ్రీన్ బెల్టు, ఎం.దేవహర్షకి గ్రీన్‌బ్లూ బెల్టు, ఇ.లక్ష్మీప్రసన్న, ఇ.దేవకీలత, ఎం.గోవర్ధన్‌లు మెరిన్ బెల్టులు సాధించినట్లు ఆయన తెలిపారు.ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగి


నరేష్‌కు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న డీఎం రమేష్ తదితరులు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ బస్‌లో తనకు కంటపడ్డ ల్యాప్‌టాప్‌ను భద్రంగా ప్రయాణికుడికి అందించారు. మంగళవారం డిపోకు చెందిన 2231 సర్వీసు నంబరు గల ఎస్.కోట – విశాఖ బస్‌లో నరేష్ అనే యువకుడు ప్రయాణం చేసి విశాఖలో దిగిపోయాడు. అతను తన ల్యాప్‌టాప్‌ను బస్‌లో మరిచిపోయి దిగిపోయాడు. బస్‌లో ఉన్న ల్యాప్‌టాప్‌ను సర్వీస్ కండక్టర్ చుక్క సతీష్ భద్రపరిచి డిపో మేనేజర్ కె.రమేష్‌కు అప్పగించారు. అనంతరం డీఎం రమేష్ ప్రయాణికుడు నరేష్‌కు సమాచారం ఇచ్చి, డిపోకు రప్పించి ల్యాప్‌టాప్‌ను అప్పగించారు. నరేష్‌తో పాటూ సహోద్యోగులు, సిబ్బంది కండక్టర్ సతీష్‌ను అభినందించారు.

తహసీల్దార్ల బదిలీ


తహసీల్దార్ సులోచనారాణి

మెరకముడిదాం: తహసీల్దార్ అజూరఫీజాన్‌కు రామభద్రపురం బదిలీ అయ్యింది. ఈయన స్థానంలో రామభద్రపురంలో తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎ.సులోచనా రాణి రానున్నారు. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగానే వీరికి బదిలీ అయ్యింది.

తహసీల్దార్‌గా ధర్మరాజు

చీపురుపల్లి: మండలానికి నూతన తహసీల్దార్‌గా డి.ధర్మరాజు నియమితులయ్యారు. రాజాం నియోజకవర్గంలోని వంగర తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన చీపురుపల్లి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. తొలుత వంగర నుంచి డెంకాడ తహసీల్దార్‌గా బదిలీ చేసినప్పటికీ తరువాత ఏమైందో తెలియదు గాని డెంకాడ ఉత్తర్వులు రద్దు చేసి చీపురుపల్లి తహసీల్దార్‌గా నియమించారు. ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ ఎస్.రాజారావును డెంకాడ తహసీల్దార్‌గా నియమించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు బదిలీ

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబుకు బదిలీ అయ్యింది. గత మూడేళ్లుగా ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు విశాఖపట్టణం జిల్లాలోని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో ఇంతవరకు ఎవరినీ నియమించలేదు.

హిందూ ధర్మ పరిరక్షణ అందరి భాధ్యత


భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న ప్రభోధా సేవా సమితి సభ్యులు

బొండపల్లి: హిందూ ధర్మ పరిరక్షణ అందరిపై ఉందని ప్రభోధా సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయనగరం జిల్లా కమిటీ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు పేర్కొన్నారు. మండలంలోని గోట్లాం, అంబటివలస గ్రామాల్లో మంగళవారం త్రైత సిద్ధాంత భగద్గీతపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గీతలోని సారాంశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని సేవా మార్గంలో నడవాలని చెప్పారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం ద్వారా సమాజాన్ని మంచి మార్గంలో నడిపించడానికి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్, రాజేష్, శిరీష, ఝాన్సీ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి వినతి

లక్కవరపుకోట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు ఏపీ స్టేట్ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల ప్రతినిధి కిలారి గౌరినాయుడు విశాఖపట్నంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా వేతనం చెల్లించాలని కోరారు. గంటల చొప్పున కాకుండా నెలవారీగా జీతం చెల్లించాలని కోరారు. గత ఎన్నికల సమయంలో తమ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేటి వరకు పట్టించుకోవడం లేదని వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మలుపుల వద్ద జంగిల్ క్లియరెన్స్


ముద్దూరుకు వెళ్లే రహదారిలో చెట్లు, తుప్పల తొలగింపు

బొండపల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారి 26 నుంచి గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమానికి ఎస్‌ఐ యు.మహేష్ శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారి నుంచి ముద్దూరు గ్రామానికి వెళ్లే రహదారికి పక్కనున్న చెట్లను పొక్లెయినర్‌తో తొలగించారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యల్లో భాగంగా జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నారు. సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన కిశోరి వికాస్ శిక్షణ


ఎస్.కోట: వెంకటరమణపేటలో కిశోరి వికాస్ ర్యాలీ


కొత్తవలస : తుమ్మికాపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఉమాదేవి


గంట్యాడ: కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఉమాభారతి

శృంగవరపుకోట: మండలంలో వెంకటరమణపేట పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎస్‌కేలు, కిశోరి బాలికలు, తల్లులతో కలిసి కిశోరి వికాస్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వారు బ్యాల వివాహాలు బాలికలకు గుది బండ, వివాహాల పేరుతో బాలికల జీవితాలు నాశనం చేయొద్దు.. బాలికలను ఎదగనివ్వడం అంటూ నినదించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు.

ముగిసిన కిశోరి బాలిక వికాస్

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో పంచాయతీ సర్పంచ్ విరోతి కొండలరావు అధ్యక్షతన ఐసీడీఎస్ వియ్యంపేట ప్రాజెక్టు సీడీపీవో రొంగళి ఉమాదేవి ఆధ్వర్యంలో కిశోరి వికాస్ ముగింపు ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఉమాదేవి మాట్లాడుతూ గత నెల 2వ తేదీ నుంచి నేటి వరకు 12 అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. లక్కవరపుకోట మండలం గొల్జాం గ్రామంలో కూడా కిశోరి వికాస శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

గంట్యాడలో...

గంట్యాడ: కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో డి.ఉమాభారతి అన్నారు. మండలంలోని గింజేరు గ్రామంలో కిశోరి వికాస్ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బాలల సంరక్షణ విభాగం నుంచి యాళ్ల నాగరాజు, సూపర్‌వైజ్ కృష్ణవేణి, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ అనిల్, ఎంఎస్‌కే భాగ్యశ్రీ, ఏఎన్ఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగమ్

విజయనగరం ఫోర్ట్: బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగమ్ కోరారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఆడపిల్లలకు 18 ఏళ్ల వయసు దాటిన తర్వాత మాత్రమే పెళ్లి చేయాలని, వయసు రాకముందు పెళ్లి చేస్తే ప్రసవ సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఒక్కోసారి తల్లి, బిడ్డలలో ఎవరో ఒకరు గానీ ఇద్దరూ గానీ మరణించే అవకాశం ఉందన్నారు. అలాగే కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు చట్ట రీత్యా నేరమని, ఎక్కడైనా అటువంటి వివాహాలు జరిగితే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో తవిటినాయుడు, డీసీపీయూ లక్ష్మి, సూపర్‌వైజర్లు జి.ఎర్రయ్యమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


పాటూరులో అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో మంగళవారం అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటప్రసాద్ మంత్రోచ్ఛరణాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీల్‌చైర్ల అందజేత


దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు వీల్ చైర్లను అందజేస్తున్న అప్పలనాయుడు

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలో ముగ్గురు దివ్యాంగులకు తన సొంత నిధులతో కొనుగోలు చేసిన మూడు వీల్‌చైర్లను మంగళవారం దివ్యాంగులు తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు తాళ్లపూడి అప్పలనాయుడు, గ్రామ సర్పంచ్ తాళ్లపూడి కీర్తి తమ సొంత నిధులతో గ్రామానికి చెందిన దివ్యాంగులు కోట జగదీష్, నీలాతి హరి, కునుకు హరీష్‌ల తల్లిదండ్రులకు వీల్‌చైర్లను అందజేశారు.

ఆలయ నిర్మాణానికి వితరణ


ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు ఆర్థిక సహకారం లభించింది. పట్టణంలోని కొత్తఅగ్రహారానికి చెందిన దివంగత మహంతి నారాయణ, అప్పయ్యమ్మ దంపతులు జ్ఞాపకార్థం కుమారులు, కుటుంబ సభ్యులు రూ.50 వేలు ఆర్థిక సహకారాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధి మండల రామచంద్రుడు మహంతి నారాయణ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పైడితల్లి అమ్మవారి ఆలయం నిర్మాణంలో ఉన్న సందర్భంలో దాతలు మందుకొచ్చి సహకరించాలని కోరారు.

రైతు సేవా కేంద్రాలకు విత్తనాలు


గడసాం రైతు సేవా కేంద్రంలో నిల్వ చేసిన వరి విత్తనాలు

దత్తిరాజేరు: మండలంలోని 13 రైతు సేవా కేంద్రాలకు వరి విత్తనాలు వచ్చినట్టు ఏవో అనురాధ మంగళవారం తెలిపారు. పెదమానాపురం, పెదకాద రైతు సేవా కేంద్రాలకు బుధవారం విత్తనాలు చేరుకుంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 13 రైతు సేవా కేంద్రాలలో 18 వందల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అభిషేక్‌కు అభినందనలు



అభిషేక్‌ను అభినందిస్తున్న స్పార్టన్ బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు

శృంగవరపుకోట: సాయ్ ఎంపికల్లో సీటు సాధించిన స్పార్టన్ క్రీడాకారుడు కె.అభిషేక్‌రాజును స్పార్టన్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. స్పార్టన్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందిన అభిషేక్‌రాజు ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)లో ప్రవేశం కోసం నిర్వహించిన ఎంపికల్లో స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్, యానాం బ్యాడ్మింటన్ అకాడమీలో సీటు సాధించారు. ఏడాది కాలం పాటూ అభిషేక్‌కు ఉచిత శిక్షణ ఇస్తారని, ప్రతిభ ఆధారంగా శిక్షణా కాలం పెరుగుతుందని, అకాడమీకి మంచి పేరు తీసుకురావాలని అకాడమీ వ్యవస్థాపకులు డి.వి.సూర్యనారాయణ, విజయరామరాజులు అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఆర్.మోహన్, బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.